క్లుప్తంగా

కనుల పండువగా పారువేట



సరిగెత్తులో పాల్గొన్న గ్రామస్తులు

వెలుగోడు: మండల పరిధిలోని మోత్కూరు గ్రామంలో మంగళవారం పారువేట ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో గ్రామ పెద్దలు, ప్రజలు బసవన్న విగ్రహాన్ని పురవీధుల గుండా మేళ తాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

మౌలాలి స్వామి సరిగెత్తు

మోత్కూరు గ్రామంలో బుధవారం మౌలాలి స్వామి సరిగెత్తు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురవీధుల గుండా మౌలాలి స్వామిని ఊరేగింపు నిర్వహించిన అనంతరం మౌలాలి స్వామిని చావిడిలో నిలబెట్టారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి



బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శిఖరేశ్వరం చెంచుగిరిజన గూడెంలో గత ఆదివారం అగ్నిప్రమాదంలో రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గిరిజనులు కట్టుబట్టలతో మిగిలారు. బుధవారం సీపీఐ(ఎం) శ్రీశైలం మండల నాయకులు బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. బాధిత గిరిజనకుటుంబాలకు ఇళ్లు నిర్మించాలని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ప్రయాణికులు సురక్షితం

శ్రీశైలం: భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థమై రాజమండ్రి జంగారెడ్డిగూడెం నుంచి వస్తున్న కారు ఇష్టకామేశ్వరి టర్నింగ్ వద్ద బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు కాగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఘటనా స్థలం ప్రకాశం జిల్లా పరిధిలోకి వస్తుండటంతో దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూర్వకొండ ఘాట్‌ను సందర్శించిన తహసీల్దార్

పగిడ్యాల: కృష్ణానది సమీపంలోని నెహ్రూనగర్ వద్ద ఉన్న మూర్వకొండ ఘాట్‌ను తహసీల్దార్ శివరాముడు బుధవారం సందర్శించారు. ఈనెల 17న జరగనున్న సింగోటం లక్ష్మీనరసింహాస్వామి రథోత్సవం సందర్భంగా భక్తులు అనుమంతి లేని ఇంజిన్ బోట్లపై ప్రయాణం చేస్తుండటంతో తహసీల్దార్ మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌లను సందర్శించి రెవెన్యూ సిబ్బందికి బందోబస్తు నిమిత్తం డ్యూటీలు వేశారు. సింగోటం జాతరకు వెళ్లే భక్తులు నది ప్రయాణం చేయకుండా ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లాలని సూచించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఘాట్ వద్దకు వచ్చే భక్తులను వెనక్కి పంపే పనిలో నిమగ్నమయ్యారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మహానంది: మహానందిలోని బుక్కాపురం వైపు ఉన్న టోల్‌గేట్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడిన ఘటనలో మహానందికి చెందిన చరణ్‌తోపాటు మరో యువకుడికి గాయాలయ్యాయి. చరణ్ తన మిత్రుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కిందపడగా మహానంది వైపు వస్తున్న మరో బైక్ వారి మీదికి వచ్చింది. గాయపడిన వారిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



ఈశ్వర్ రెడ్డి(ఫైల్)

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నంద్యాల ఈశ్వర్ రెడ్డి (75) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య అచ్చమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఫోన్‌లో ఈశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మహానంది: గాజులపల్లె గ్రామంలోని రైతు గూడపోగుల శ్రీనివాసులుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. గాజులపల్లె శివారులోని పంట పొలాల్లో మేతకు వెళ్లిన పశువుకు విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందిందని యజమాని శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

ఊరూరా సంక్రాంతి

- అంబరాన్నంటిన పండుగ సంబరాలు
- ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లుల హరివిల్లులు

ఊరూరా సంక్రాంతి సంబరాలు కనిపించాయి. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో పండుగను మూడు రోజుల పాటు సంతోషంగా నిర్వహించుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హరిదాసులు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలిపటాకుల వయ్యారాలు ప్రత్యేకంగా నిలిచాయి.



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంలో..

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలో నిర్వహించిన పోటీలలో స్థానికులతో పాటు నంద్యాల, మార్కాపురం తదితర ప్రాంతాలకు చెందిన 32 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

➤ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఏకలవ్య నగర్‌లోని సీతారామ ఆలయంలో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి మూడు స్థానాల్లో విజేతలకు నిలిచిన మహిళలకు వరుసగా రూ.1016, రూ.516, రూ.316 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

➤ బండి ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద దేవళాపురం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్న బాదుల్లా, పెద్ద బాదుల్లా స్వాముల వారి సరిగెత్తును నిర్వహించారు. పొట్టేళ్ల పందేలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అలాగే సింగవరం గ్రామంలో కూడా కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

➤ వెలుగోడులో..

వెలుగోడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. మహిళలు పోటీపడి ఇళ్ల ముందు ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు, బంధుమిత్రులు గ్రామాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది.

➤ పాములపాడు: సంక్రాంతి పండుగను ప్రజలు సంబరంగా నిర్వహించుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లోని గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం లింగాల గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచు మల్లీశ్వరరెడ్డి

➤ పగిడ్యాల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్త సంవత్సరంలో అడుగుపెట్టిన మొదటి వారంలోనే మకర సంక్రాంతి రావడంతో ఆనందోత్సవాల మధ్య భోగిమంటలు వేసి సంబరాలు చేసుకోగా.. పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ తెలుగు సంప్రదాయాన్నిచాటుకున్నారు.

➤ కొత్తపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో పురోహితులు యాదవేని లక్ష్మీనరసయ్య శర్మ, ఆలయ చైర్‌పర్సన్ జయమ్మ ఆధ్వర్యంలో పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామివార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్లకు బిందెసేవ, గణపతి రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, అంకురార్పణ తదితర విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి గ్రామ నలుమూలలా మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి, జీలాకర్ర బెల్లం కార్యక్రమం, మాంగళ్యధారణ నిర్వహించి వేదమంత్రోశ్చారణల మధ్య కల్యాణ తంతును పూర్తి చేశారు. కాగా బుధవారం తాండవ మల్లేశ్వరుడి ప్రభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం సందర్భంగా భక్తలకు అన్నదానం కోసం ఆలయ పూర్వపు పూజారి బొల్లాపిన్ని ఉమామహేశ్వర శర్మ కుటుంబం రూ.15,116 విరాళం ఇచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



భాజాభజంత్రీలతో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

➤ రమణీయం.. రథోత్సవం

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తూర్పు, పడమర గ్రామాల్లో బుధవారం నిర్వహించిన నాగేశ్వర స్వామి, నందీశ్వర, కాశీ విశ్వేశ్వర స్వామి వర్ల రథోత్సవ వేడుకలు రమణీయంగా సాగాయి. వేలాది మంది భక్తుల జనసందోహం మధ్య సాగిన రథయాత్ర కనుల పండువగా సాగింది. పుర వీధులగుండా రథయాత్ర కొనసాగుతుండగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్త్ చర్యలు చేపట్టారు. జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు, మిడుతూరు, ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌ల సిబ్బంది విధులు నిర్వహించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథం ముందుకు కదిలింది.

➤ తరిగోపుల గ్రామంలో ..

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో మంగళవారం లక్ష్మీచెన్నకేశవ, అనంతనాగేశ్వరస్వామి వార్ల రథోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ, సర్పంచ్ అంజనమ్మ, గ్రామపెద్దల సమక్షంలో అర్చకులు వేదమంత్రాలు పఠించగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై కూర్చోబెట్టి బంతి, చేమంతి పూలతో అలంకరించిన రథం ముందు బలిహారతి ఇచ్చి రథాన్ని భక్తులు ముందుకు లాగారు.

➤ మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతోపాటు తిమ్మాపురం, గాజులపల్లె, అబ్బీపురం, బుక్కాపురం, తమ్మడపల్లె, బొల్లవరం, అల్లినగరం, గోపవరం, గాజులపల్లె ఆర్ఎస్, సీతారామపురం, మసీదుపురం, నందిపల్లె గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన మహానందీశ్వరస్వామి, సీతారాముల వారి దంపతులకు భోగి, మకర సంక్రమణ సందర్భంగా తిరుమంజనం పూజలు నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తిమ్మాపురంలో సీతారాములవారికి గరుడవాహనంపై, బుక్కాపురంలో లక్ష్మీచెన్నకేశవస్వామికి గ్రామోత్సవాలు నిర్వహించారు.



మహానందిలో గంగిరెద్దుల ప్రదర్శనలు

హోరాహోరీగా అంతర్‌రాష్ట్ర బండలాగుడు పోటీలు



హోరాహోరీగా జరుగుతున్న అంతర్‌రాష్ట్రస్థాయి పాలబండ పోటీలు

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన అంతర్‌రాష్ట్ర స్థాయి పాలబండలాగుడు పోటీలు వృషభాల మధ్య హోరాహోరీగా జరిగాయి. బండలాగుడు పోటీలను ఎస్ఐ ఎం.కేశవ ప్రారంభించి ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం, నాగర్‌కర్నూలు జిల్లా, లింగాల మండలం, రాయవరం గ్రామానికి చెందిన అక్షర రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.30,000, కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామానికి చెందిన రమేష్ నాయుడు ఎద్దులు రెండవ బహుమతి రూ.20,000 కైవసం చేసుకున్నాయి. గద్వాల జిల్లా, మండకల్ మండలం , అమరవాయి కి చెందిన గోవర్ధన్ వృషభాలు మూడవ బహుమతి రూ.15,000, నంద్యాల జిల్లా, మిడుతూరు మండలం, మిడుతూరు గ్రామానికి చెందిన సాయి వర్ధన్ వృషభాలు నాల్గవ బహుమతి రూ.10 వేలు సొంతం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా, జూపాడు బంగ్లా మండలం, మండ్లెం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఎద్దులు 2405 అడుగులు లాగి ఐదవ బహుమతి రూ.8 వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా, బనగానపల్లె మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కే నాగేంద్ర ఎద్దులు ఆరవ బహుమతి రూ.5,000 గెలుపొందాయి. కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, బాపనపల్లి గ్రామానికి చెందిన కొప్పెర్ల జయమ్మ వృషభాలు ఏడవ బహుమతిగా రూ.3000 దక్కించుకున్నాయి. కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, బాపనపల్లి గ్రామానికి చెందిన మల్లు మౌలాలి కి చెందిన వృషబాలు 949 అడుగుల దూరం అది 8వ బహుమతి రూ. 2 వేలు దక్కించుకుకోవడంతో పోటీలు హోరాహోరీ ప్రశాంతంగా ముగిశాయి.

సకల దేవతా స్వరూపం.. గోమాత



గో పూజ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: గో సంతతితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, సకల దేవతా స్వరూపం గోమాత అని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు ఆమంచి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో కనుమ పర్వదినం పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో గో పూజ, ధార్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. గోపూజ ముందు వృషభరాజులతో గ్రామ సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోజాతి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. గోమాతను పూజిస్తే సకల దేవతలను ఆరాధించినట్లేనన్నారు. కనుమ పర్వదినం రోజున గోపూజ చేస్తే ఏడాది పొడవునా శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం భక్తులు గో ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకట్రామయ్య, రామ్మోహన్, డాలు చిట్టిబాబు, అచారి, మజ్జరి వెంకటేశ్వర్లు, శేషాద్రి, శేషయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నందికొట్కూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో గోరంట్ల చిన్న రంగమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ గద్దల లాజర్, శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జీ చంద్రశేఖర్ బుధవారం వృద్ధులకు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మాయావతి బహుజనుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కేంద్రాన్ని గతంలో ఢీకొట్టిన ఘనత మాయవతికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం కో ఆర్డినేటర్ చిట్టెన్న, పాల్గొన్నారు.

వైభవంగా పారువేట

మిడుతూరు: స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి పారువేట ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి పారువేట మండపం వరకు అశ్వవాహనంపై ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గజవాహనంపై ఆలయం వద్దకు చేరుకున్నారు. గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

బహుమతుల పంపిణీ



మహిళలకు బహుమతులు అందజేస్తున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు టౌన్ సీఐ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ప్రతిభను గుర్తించేందుకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజల ఇబ్బందులు

ఆత్మకూరు: పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం అన్నారు. మంగళవారం అర్బన్ కాలనీలో, వీరభద్ర ఏరియా, గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, గొల్లపేటల్లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, డీవైఎఫ్ఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయూ ,వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పద్మావతి హైస్కూల్, స్నేహ స్టడీ సర్కిల్, స్పేస్ కంప్యూటర్‌ల వారి సహకారంతో ముగ్గుల పోటీలు, చిన్నారులకు రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

బీమా ప్రీమియం చెల్లింపునకు నేడు ఆఖరు

వెలుగోడు: మండలంలో రబీలో సాగుచేసిన వరి పంటకు ఫసల్ బీమా యోజన చెల్లింపునకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. మండలంలో 3,500 ఎకరాల్లో సాగుచేసిన వరి పంటకు తప్పనిసరిగా బీమా ప్రీమియం చెల్లించాలన్నారు.

నల్లమల శివారులో డ్రోన్ కెమెరాతో నిఘా

మహానంది: మహానంది మండలంలోని నల్లమల పరిసర గ్రామాలైన గాజులపల్లె, బసవాపురం, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లో బుధవారం డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా ఉంచారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అరటితోటలు, అడవి శివారు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పరిశీలించారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు, బహిరంగ మద్యపానం లాంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డ్రోన్ల ద్వారా నిఘా ఉంచామన్నారు. గాజులపల్లె సమీపంలో ఇద్దరు ఓపెన్ డ్రింకింగ్ చేస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ చెప్పారు.

చూసిన కనులదే భాగ్యం!

కనుల పండువగా పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం

- చెంచులు నూతన వస్త్రాలు, అడవి ఆకుల ఆభరణాలు సమర్పణ
- స్వామిఅమ్మవార్లకు కైలాస వాహన సేవ
- కనుమ పండుగ రోజున శాస్త్రోక్తంగా గోపూజ



పార్వతీపరమేశ్వరుల లీలాకల్యాణోత్సవ దృశ్యం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ దంపతులు, చెంచులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో పార్వతీ, పరమేశ్వరుల లీలా కల్యాణోత్సవం వైభవంగా సాగింది. మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో బ్రహ్మోత్సవ కల్యాణం జరిపించారు. ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. మహాగణపతిపూజ, అభ్యుదయాన్ని, శుభాన్నికాంక్షిస్తూ పుణ్యాహవచనం జరిపారు. తరువాత స్వామిఅమ్మవార్లు ఆశీనులైన సింహాసనానికి, కంకణాలకు పూజాదికాలు జరిపించి కంకణధారణ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నుదుట బాసిక ధారణ చేశారు. మహాసంకల్పం తరువాత లగ్నాష్టకాలుగా పిలువబడే మంగళకరమైన ఎనిమిది శ్లోకాలు పఠించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పించారు. మాంగళ్య పూజ జరిపించి అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. తరువాత తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ఉత్తరీయానికి, అమ్మవారికొంగుతో బ్రహ్మముడివేసి స్వామిఅమ్మవార్లకు పునఃపూజ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నూతన వస్త్రాలు, అడవి ఆకులతో ఆభరణాలు..

చెంచులు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్ దంపతులు నూతనవస్త్రాలకు, ఆకులతో అల్లిన ఆభరణాలకు రాజగోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తలపై పెట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈత ఆకులతో అల్లిన కంకణాలు, బాసికాలు, స్వామివారికి యజ్ఞోపవీతం, అమ్మవారికి వడ్డాణం, మెట్టెలు, మెడలో అలంకరించేందుకు ఆకులతో అల్లిన హారాలను సమర్పించారు. కల్యాణ సమయంలో చెంచు భక్తులు సమర్పించిన ఈ ఆభరణాలన్నింటిని స్వామిఅమ్మవార్లకు అలంకరించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని అర్ధవీడు, యాచవరం, చెంచుకాలనీ, దోర్నాల ఎస్టీ కాలనీ, బందం బావి, మేకలబండ, మాణిక్యసెల పలు గూడేలకు చెందిన చెంచు భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

నందివాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లకు నందివాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో నందివాహనంపై ఆశీనులను చేయించి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, ఇతర అర్చకులు ప్రత్యేక వాహన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

కనుమ పండగ రోజు గోపూజ

కనుమ పండుగరోజైన బుధవారం శ్రీశైల దేవస్థానంలో శ్రీగోకులంలో, గోసంరక్షణశాల వద్ద గోపూజ నిర్వహించారు. గోకులం వద్ద లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ పూజా సంకల్పం, మహాగణపతిపూజ జరిపించారు. శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతో, గోవులకు స్వామివారి ఆలయ ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శ్రీశైలంలో గోపూజ మహోత్సవం

రావణవాహనాధీశా..నమోస్తుతే!

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం స్వామిఅమ్మవార్లకు రావణవాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలంకార మండపంలోనికి శీనులను చేయించి రావణవాహనంపై అదిష్ఠించారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా వాహనపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఆలయ ఉత్సవం దేదీప్యమానంగా కొనసాగింది. రావణవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.



శివపార్వతుల వేషధారణలో అలరించిన భక్తులు

నేడు బ్రహ్మోత్సవాలకు యాగ పూర్ణాహుతి

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామిఅమ్మవార్లకు ప్రాతఃకాల పూజల అనంతరం స్వామివారి యాగశాలలో పూర్ణాహుతి, అవబృథం, కలశోద్వాసన, వసంతోత్సవం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ, విశేషార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు.